క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



రమణయ్యపేటలో సరకులు పంపిణీ చేస్తున్న కోరమండల్ మహిళా సంఘ సభ్యులు

కాకినాడ రూరల్: కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ సమాజ సేవే పరమావధిగా తమ మహిళా సంఘ సభ్యులు ప్రతి నెలా నిత్యావసర సరకులు పంపిణీ చేపడుతున్నారన్నారు. సంఘ కోశాధికారి శ్రీదేవి, లక్ష్మీ సృజన, మోహినికుమారి, మాధవి, దీపిక, డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త శిరీష, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న వైద్య బృందం, సర్పంచ్ ఆశాజ్యోతి

కరప: స్థానిక శాంతి బాప్టిస్ట్ చర్చిలో శనివారం లెనోరా దంత వైద్య కళాశాల (రాజానగరం) ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిని గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు, స్థానికులకు డాక్టర్ కిరణ్ కార్తీక్ దంత కళాశాల బృందంతో కలసి దంత పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పేస్టులు అందజేశారు. శిబిరంలో పాల్గొన్న వారికి రాజానగరం హాస్పిటల్‌లో ఉచిత చికిత్స అందజేస్తామని వైద్య బృందం తెలిపింది. పాస్టర్ డి.జయప్రకాష్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఉపాధి కల్పించాలి



విద్యార్థులను సత్కరించిన జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: ఇంజినీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి కల్పించే దిశగా కళాశాలలు ఉండాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక కైట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 32 మంది విద్యార్థులు ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ ఇన్ఫోసిస్, ఎంజూర్‌లో ఉద్యోగాలు సాధించగా శనివారం వీసీ సమావేశ హాల్లో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. అనంతరం రిపబ్లిక్ డే రోజున ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ పరేడ్‌లో కైట్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపగా, వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఇస్రో సైంటిస్ట్ కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ రామకృష్ణ, కళాశాల డైరెక్టర్ పోతుల ఐశ్వర్య, సురేఖ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

బాలాజీచెరువు: గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులను స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అభినందించారు. డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులు ఎ.రూపాంజలి, ఎం.వెంకన్న బాబులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు నేవీ అసోసియేట్ ఆఫీసర్ జెట్టి పాండురంగారావు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.జయదేవ్ అభినందించారు.

డబ్బుల్లేవ్ బాబూ..!

- స్మార్ట్ సిటీలో ఎక్కడి పనులు అక్కడే
- నిధులు రాక సాగని అభివృద్ధి
- మార్చితో ముగియనున్న ప్రాజెక్ట్
- పైసా విదల్చని ఏపీ ప్రభుత్వం



స్మార్ట్‌సిటీ లోగో



2022లోనే ముగింపు

కాకినాడ: స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కాల పరిమితిని 2025 మార్చి వరకూ పొడిగిస్తూ కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయానికి ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. ప్రాజెక్టు కాల పరిమితి దగ్గర పడుతున్నప్పటికీ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవసరమైన రూ.196 కోట్లలో ఏపీ ప్రభుత్వం ఒక్క పైసా నిధులు కూడా విడుదల చేయడం లేదు. ఫలితంగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కాల పరిమితిని మరో 9 నెలలు పెంపుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దేశంలోని 100 నగరాలను స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం 2017లో ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి అమరావతి, విశాఖ, తిరుపతి, కాకినాడకు స్థానం దక్కింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2015–20 మధ్య వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.978 కోట్ల ఖర్చుకాగల పనులను అప్పట్లో ప్రతిపాదించారు. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు 2020లోనే ముగిసిపోయింది. అయితే అప్పటి నుంచి ప్రాజెక్టు కాలపరిమితిని పెంపుదల చేస్తూ వచ్చారు. తాజాగా 2024 జూలై 1వ తేదీన కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రాజెక్టు కాలపరిమితిని 2025 మార్చి వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు 2025 మార్చి నాటికల్లా పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాల్సి ఉంది.

జీతాలకు కొరతే...

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో పనిచేసే ఉద్యోగుల జీతాలకు కూడా కటకటలాడే పరిస్థితి కనిపిస్తోంది. ఆదాయాన్ని సమకూర్చే ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం.. వాటి ద్వారా వచ్చే ఆదాయంతోనే స్మార్ట్‌సిటీ మనుగడ సాధించాల్సి ఉంటుంది. దీంతో నిధులు లేక ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. కాగా దీనిపై స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ పి.కామేశ్వరరావును వివరణ కోరగా తాను కొద్దిరోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించానని, నిధుల విడుదలకు సంబంధించిన సమాచారం, ఇతర వివరాలు తన వద్ద లేవని స్పష్టం చేశారు. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.196 కోట్ల బకాయిలు

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.186 కోట్లు, కేంద్ర వాటాగా రూ.8 కోట్లు విడుదల కావాల్సి ఉంది. కేంద్ర నిధులు రూ.8 కోట్లు వెరసి రూ.190 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేసినట్టు స్మార్ట్‌సిటీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ప్రభుత్వం రూ.196 కోట్లను తక్షణమే విడుదల చేయాలి. ప్రాజెక్టు కాలపరిమితిని 9 నెలలు పొడిగిస్తూ గత ఏడాది జూలైలో నిర్ణయం తీసుకున్నా ఇప్పటి వరకూ ఏపీ ప్రభుత్వం పైసా విదల్చలేదు. ఇటీవల బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినా అవి కూడా విడుదల కాలేదు. మార్చి నెల సమీపిస్తోన్న తరుణంలో ఇప్పటి వరకూ నిధులు విడుదల కాకపోవడంతో పెండింగ్ ప్రాజెక్టులన్నీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రధానంగా నగరపాలక సంస్థ కార్యాలయ భవనంతోపాటు సైన్స్ సెంటర్, కన్వర్టబుల్ స్టేడియం వంటి ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ మందకొడిగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నిధులు రాకపోతే స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులన్నీ గందరగోళంలో పడతాయంటున్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు



రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ: మహాకుంభమేళాకు వెళ్లే కాకినాడ జిల్లా ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును ఎంపీ తంగెళ్ల శ్రీనివాస్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ–ప్రయాగరాజ్ మధ్య ఈ ప్రత్యేక రైలు ప్రయాణిస్తోంది. ఎంపీ విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ ఈ రైలును ఏర్పాటు చేసింది. కాకినాడ నుంచి సామర్లకోట వరకు ఎంపీ తంగెళ్ల స్లీపర్ రైలు బోగీలో ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటించి కుంభమేళా యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కౌడా ఛైర్మన్ తుమ్మల బాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లాజర్ బాబు, నాయకులు నున్న దొరబాబు, మాదేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరికలను అదుపులో ఉంచుకుంటే సుఖసంతోషాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మ ప్రచారక్ రఘు

కరప: ప్రతి మనిషి కోరికలను అదుపులో ఉంచుకుంటే సుఖసంతోషాలతో పాటు ఆరోగ్యకరంగా ఉంటారని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. శనివారం కరప నీలయ్యతోట వీధిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరికలు పెరిగేకొద్దీ కష్టాలు మొదలవుతాయన్నారు. ఉన్నదానితో తృప్తి పొందితే దానికి మించిన సుఖమేదీ ఉండదన్నారు. ధార్మిక జట్టు సభ్యులతో హనుమాన్ చాలీసా, భజనలు పాడించారు. అనంతరం సభ్యులతో ధర్మ నిధి సేకరణ చేయించారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కాదా సత్యనారాయణ, మహిళా కన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం, సహ కన్వీనర్ కొక్కెరమెట్ల రామకృష్ణ, కె.సత్యనారాయణ, నున్న అమరావతి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డీఎంఈ పర్యటన

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శనివారం పర్యటించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని కమ్యూనిటీ హాల్ ఆవరణలో అడ్మినిస్ట్రేటివ్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు.

ఎస్‌ఏపీ అసోసియేషన్ సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న జార్జ్

నాగమల్లితోట జంక్షన్: స్థానిక జేఎన్‌టీయూ అల్యూమినీ సెమినార్ హాల్లో ఏపీ పీఈటీస్, ఎస్‌ఏపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ మీట్– సెమినార్ నిర్వహించారు. దీనికి ఎల్.జార్జ్ అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కిషోర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, జేఎన్‌టీయూకే సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఆర్‌ఐపీ డాక్టర్ మహమ్మద్ బాషా, జిల్లా, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రభాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కరీముల్లా చౌదరి, అధ్యక్షుడు వీరవిరాజు, కార్యదర్శ కె.నూకరాజు, ట్రెజరర్ రవి సుందర్‌కొర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోతాదు మించొద్దు

- విచక్షణా రహితంగా ఎరువులు వద్దు
- చీడపీడలు విజృంభించే ప్రమాదం



దాళ్వా వరి పైరుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

కాకినాడ సిటీ: పంట దిగుబడిని పెంచడంలో ఎరువుల పాత్ర కీలకం. సార్వా పంట కంటే దాళ్వాలో రైతులు ఎక్కువగా ఎరువులు వినియోగిస్తుంటారు. అయితే వరి పైరులో అవసరమైన మేరకే ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో మితిమీరి ఎరువులు వేస్తే అనర్థమే. దీనివల్ల చీడపీడలు విజృంభించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాకినాడ రూరల్, అర్బన్ ప్రాంతాల్లో 14,300 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేస్తున్నారు. ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల పోషకాలతో పాటు జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు కూడా చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతో పాటు చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో వివిధ రకాల ఎరువుల్లో ఉన్న పోషకాల మోతాదు, వాటి ఉపయోగాలు, ఎరువులు వేయాల్సిన సమయంపై రైతులు అవగాహన కల్పించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎకరా వరికి ఏం అవసరమంటే..

ఎకరా వరికి 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూనతిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమ భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, రెండో దఫా పిలకలు కట్టే దశలో వేసిన రైతులు చివరి దఫా అంకురం దశలోనూ చేసుకోవాలి. పొటాష్, ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని ఎరువు వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతంగా పని చేయాలంటే బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి రెండు రోజులు నిల్వ ఉంచిన తరువాత పొలంలో చల్లుకోవడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క దృఢంగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మపోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపంతొ నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనెల తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకు పచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మరుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2–5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

ఇనుప ధాతు లోపం

సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలలు, మెట్ట నారుమడులు వేసే ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసిన తరువాత నీరు నిలచిన పొలాల్లో ఇనుప ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో ముందుగా లేత ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమేపీ ఆకు అంతా తెల్లగా మారి ఎండిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

దిగుబడులపై ప్రభావం



దాళ్వా పంటలో రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలని ఎరువులను ఎక్కువగా వినియోగించడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమే కాక చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముంది. వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలి.

–ఏవీ రాజేష్, మండల వ్యవసాయాధికారి, కరప

వేడుకగా వేంకటేశ్వరుని కల్యాణం



యండమూరు వేంకటేశ్వరస్వామికి గరుడోత్సవం

కరప: యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దివ్య కల్యాణం శనివారం రాత్రి వేడుకగా జరిగింది. వైఖానస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణతో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ముందుగా వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాదికాలు జరిపారు. సాయంత్రం ధ్వజారోహణ, గరుడోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను దేవదాయ శాఖ ఈఓ ఏఆర్వీ అపర్ణ, కె.రఘు పర్యవేక్షించారు.

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు ఆర్జిత సేవలు, అగ్ని ప్రతిష్ఠాపన, హోమాలు, ధ్వజారోహణ నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారికి ఆలయ ఈఓ శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు.

అరట్లకట్టలో..

కరప: అరట్లకట్ట శివాలయంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి కల్యాణాన్ని భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని, అమ్మవార్ల ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు కొంతేటి సూర్యదత్త శివకుమార్ పూజలు చేశారు. తర్వాత రథంలో ఉత్సవ విగ్రహాల ఉంచి గ్రామోత్సవం జరిపారు. రాత్రి స్వామివారికి కల్యాణం చేశారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, చీరట్ల శ్రీను పర్యవేక్షించారు.



గాంధీనగర్ వేంకటేశ్వరుని ఆలయంలో వార్షిక కల్యాణం చేయిస్తున్న ఆలయ అర్చకులు



అరట్లకట్టలో స్వామి, అమ్మవార్ల రథోత్సవంలో భక్తులు

బీజేపీ నాయకుల సంబరాలు

కరప: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. నడకుదురులో మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, నాయకులు రొంగల సన్యాసిరావు, చింతాడ శివ, చిటిమిరెడ్డి గోవిందు తదితరులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు.

రామారావుపేటలో..

బోట్‌క్లబ్: అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని, అందుకే ఢిల్లీ ప్రజలు తమ పార్టీ వైపు మొగ్గు చూపారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక రామారావుపేటలో శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడంతో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠం బీజేపీ కైవసం చేసుకొందన్నారు. ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన అందిస్తారని ప్రజలు నమ్మి, అధిక మెజార్టీ అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మొసలగంటి సురేష్, గౌతు చిన్న పాల్గొన్నారు.

గోవిందా... హరి గోవిందా

- వైభవంగా భీష్మ ఏకాదశి పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



వేంకటేశ్వరస్వామి అలంకరణలో మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి



కరపలో వేణుగోపాలస్వామి



యండమూరులో మీసాల వెంకన్న



ప్రత్యేక అలంకరణలో గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: భీష్మ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు శనివారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృభిషేకం, సహస్ర నామార్చన, ద్రవిడ ప్రబంధ పారాయణ జరిపారు. అనంతరం గ్రామోత్సవాలు నిర్వహించారు. కాకినాడ గాంధీనగర్‌లోని వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచి స్వామి దర్శనం కోసం క్యూ కట్టారు. ఆలయ ఈఓ సత్యవేణి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు చేశారు. వెంకట్ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మెహర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ నిర్వహించారు.

కరప: మండలంలోని కరప, జెడ్.భావారం, పెనుగుదురు, కూరాడ, చినమామిడాడ, యండమూరు, కొంగోడు, వేళంగి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల్లో భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. కరప విష్ణాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, యండమూరులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు నిర్వహించారు. కరప కొత్తపేట రామాలయ కమిటీ ప్రతి ఇంటి గోడలపై ఓం శ్రీరామ అని రాయించి శ్రీరామ ప్రచారం నిర్వహించింది. కరప కొత్తపేట రామాలయం వద్ద శ్రీరామ సప్తాహ కార్యక్రమం చివరి రోజు జరిగింది. ఆయా ఆలయాల వద్ద కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని నంది విగ్రహాల వద్ద పూజలు నిర్వహించి, గోలనుబు రాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాకినాడ రూరల్: సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. విష్ణు సహస్ర నామం భీష్మ ఏకాదశి రోజున పుట్టిన సందర్భంగా ఆలయంలో శ్రీవిష్ణు సహస్ర నామాలతో ఏకాహం నిర్వహించారు. వేలాదిగా వచ్చిన భక్తులకు కొమ్మర్తి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ఒక్కరోజే స్వామి వారికి రూ.94,234 ఆదాయం వచ్చిందని ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు.



← సర్పవరం ఆలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు